క్లుప్తంగా

ఘనంగా పాళమ్మతల్లి విగ్రహప్రతిష్ఠ



పాళమ్మ తల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు తదితరులు

కరప: మండలం పెనుగుదురులో గురువారం పాళమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. గ్రామస్తుల వినతి మేరకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రూ.35 లక్షలు మంజూరు చేయడంతో సర్పంచ్ రెడ్డిపల్లి వెంకటమాధవి, రమేష్, ఎంపీటీసీ సభ్యురాలు బండారు సుజాత, వెంకటేశ్వరరావులు ఆలయ ఉత్సవ కమిటీ, దేవదాయశాఖ ఈఓ పీఎస్ఆర్‌వీ సూర్యనారాయణరాజు పర్యవేక్షణలో శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని పునర్నిర్మించారు. మూడు రోజులుగా కోనసీమ వాస్తవ్యులు బ్రహ్మశ్రీ ఉపద్రష్ట లక్ష్మీనరసింహశాస్త్రి ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నాయకులతో కలసి ఎమ్మెల్యే కన్నబాబు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ మతాలకు అతీతంగా అన్ని దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, కరప వ్యవసాయ మార్కెట్‌చైర్మన్ కర్నాసుల సీతారామాంజనేయులు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జగన్మోహినిగా సీతారామస్వామి



బోట్‌క్లబ్: స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామ స్వామి ఆలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారు జగన్మోహినిగా భక్తులను దర్శనమిచ్చారు. స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు భావవరపు భాస్కరాచార్యులు ఉదయం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

వైభవంగా వేంకటేశ్వర అన్న కూటోత్సవం

అనంతరం భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ



అన్న కూటోత్సవంలోని స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

కాకినాడ రూరల్: ధనుర్మాసం సందర్భంగా రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం అన్న కూటోత్సవం వైభవంగా జరిగింది. స్వామి విగ్రహదాత ఆకుల రాజబాబు, వెంకట లక్ష్మణ రేఖ దంపతులు ఆధ్వర్యంలో 65 కిలోల పులిహోరాతో ఆలయ అర్చకుడు పవన్‌కుమార్ వెంకటేశ్వరస్వామిని తయారు చేశారు. అధిక సంఖ్యలో పులిహోరతో తయారు చేసిన వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం సుమారు 2వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఇంటి నందిబాబు, వైఎస్‌కే మూర్తి, రెడ్డి, వేణు మాణిక్యాలరావు, వెంకటేశ్వరరావు, శివ, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీసీ బలోపేతానికి చర్యలు



ఏఐసీసీ నియోజకవర్గాల కమిటీకి నియామక పత్రాలు అందిస్తున్న రైమోజోహాని, చిత్రంలో జిల్లా అధ్యక్షుడు రిక్కి గూటం తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లాలో ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐసీసీ) బలోపేతానికి చర్యలు తీసుకుంటానని జిల్లా అధ్యక్షుడు రిక్కిగూటం తెలిపారు. గురువారం సామర్లకోట మండలం బ్రహ్మానందపురంలోని కేటీసీ విద్యాసంస్థల ఆవరణలో ఆల్‌ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా నియోజకవర్గాల కమిటీల ప్రమాణ స్వీకారం జరిగింది. జిల్లా కార్యదర్శి ఎం.స్టీఫెన్ ఆనంద్ వారికి స్వాగతం పలికారు. జిల్లా అధ్యక్షుడు రిక్కిగూటం అధ్యక్షత వహించి మాట్లాడుతూ 70 మంది సభ్యులతో 7 నియోజవర్గాల్లో నూతన కార్యవర్గం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఏఐసిసి రాష్ట్ర అధ్యక్షుడు రైమో జోహని హెలోనెస్ ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్రంలో ఏఐసీసీ బలోపేతం చేసేందుకు అన్ని జిల్లాల్లో కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోసెఫ్‌బెన్ని, రాష్ట్ర కార్యదర్శి విక్టర్ శామ్యూల్ ప్రసంగించారు. అనంతరం నూతన కమిటీలు ప్రమాణ స్వీకారం చేశాయి. ఏపీ స్టేట్ ఫైనాన్స్ డైరెక్టర్ జాన్‌వెస్లీ ఏఐసీసీ జిల్లా నాయకులు మడికి శామ్యూల్‌రాజు, జ్ఞానసుధీర్, రాజ్‌కమల్, సామ్‌జోసెఫ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి వారధి ముత్తా

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- ఫ్లై ఓవర్‌పై అట్టహాసంగా రాకపోకలు ప్రారంభం
- ముందుగా పయనించిన గోపాలకృష్ణ వాహనం



ఫ్లై ఓవర్‌పై రాకపోకలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి, మాజీ మంత్రి ముత్తా గోపాలకృష్ణ

కాకినాడ: ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ముత్తా గోపాలకృష్ణ వారధిపై గురువారం నుంచి వాహనాల రాకపోకలకు శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా ఫ్లై ఓవర్‌ను ప్రజలకు అంకితం చేసిన నేపథ్యంలో గురువారం ఉదయం ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో రాకపోకలను ప్రారంభించారు. ఫ్లై ఓవర్‌కు మాజీ మంత్రి ముత్తా గోపాలకృష్ణ వారధిగా నామకరణం చేసిన నేపథ్యంలో ఆయన వాహనాన్ని ముందుగా నడిపించి రాకపోకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించడంతో పాటు కేరళ వాయిద్యాలు, బాణ సంచాకాల్పులు, పెద్దఎత్తున పార్టీ క్యాడర్, వైశ్య ప్రముఖులతో బ్రిడ్జిపై నడుస్తూ ప్రజల వాహనాలను కూడా అనుమతించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా గోపాలకృష్ణ కాకినాడ అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. సిటీ పరిధిలో ఉన్న మూడు ఫ్లై ఓవర్లకు ఆయన తన హయాంలోనే అనుమతి సాధించారని, వాటిని తన హయాంలో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రాజకీయాలను పక్కన పెట్టి చేసిన సేవలను గుర్తించి ముత్తా గోపాలకృష్ణ వారధిగా పేరుపెట్టాలని తాను చేసిన ప్రతిపాదనకు ఆయన కూడా సానుకూలంగా స్పందించడం సంతోషాన్నిచ్చిందన్నారు. రాజకీయ నాయకులకు, అభివృద్ధికి ముత్తా గోపాలకృష్ణ దిక్సూచిగా అభివర్ణించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ముత్తా గోపాలకృష్ణ మాట్లాడుతూ పెరుగుతున్న ట్రాఫిక్ ఒత్తిడిని దృష్టిలో ఉంచుకుని తాను చేసిన విజ్ఞప్తిని మన్నించి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మూడు ఫ్లై ఓవర్లను మంజూరు చేశారన్నారు. ఇవన్నీ వినియోగంలోకి రావడం తనకెంతో సంతృప్తిని కలిగిస్తోందని చెప్పారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రాంతీయ సమన్వయకర్త, గోదావరి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పెద్ది రత్నాజీ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో వైశ్య ప్రముఖులు కూడా ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఆర్యవైశ్య మహాసభ అర్బన్‌జిల్లా అధ్యక్షుడు బాదం మధు, వైశ్య ప్రముఖులు నారాయణం మురళి, సోముప్రసాద్, కంతేటి కాశి, లారీ యజమానుల సంఘ అధ్యక్షుడు ఎస్ఎస్ రాజు, వైఎంవీఏ కాకినాడ అధ్యక్షుడు లింగమల్లు కృష్ణమూర్తి, మాజీ కార్పొరేటర్లు బసవా చంద్రమౌళి, ఐ.శ్రీను, ఇనుకొండ పట్టాభిరామయ్య, కొలగాని దుర్గాప్రసాద్, నల్లబెల్లి సుజాత , కర్రి శైలజ, పలువురు మాజీ కౌన్సిర్లు, పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో కేరళ వాయిద్యాల సందడి



ఫ్లై ఓవర్‌పై ముందుగా వెళ్తున్న ముత్తా వాహనం

సీఎం సభ సక్సెస్‌తో మతి భ్రమించిందా?

- అవాకులు చెవాకులు పేలితే అవినీతి బాగోతాలన్నీ బయటపెడతా
- వనమాడి తీరుపై ఎమ్మెల్యే ద్వారంపూడి ఫైర్

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాకినాడ పర్యటన సక్సెస్ కావడంతో టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మండిపడ్డారు. అధికారంలో ఉన్నంతసేపూ ప్రజలను నిర్లక్ష్యం చేసిన టీడీపీ ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం విమర్శలు చేస్తోందంటూ ధ్వజమెత్తారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ 2019 నుంచి ఇవ్వాల్సిన రూ.3వేల పింఛన్ సొమ్మును ఎన్నికలకు ముందు ఇచ్చారంటూ వనమాడి చేసిన వ్యాఖ్యలపై ద్వారంపూడి ఫైర్ అయ్యారు. ఎన్నికల మేనిఫెస్టోలో పింఛన్ల సొమ్మును దశలవారీగా పెంచుకుంటూ వెళ్తామని స్పష్టంగా చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. టీడీపీలాగ మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి తప్పించిన చరిత్ర తమది కాదన్నారు. టీడీపీ హయాంలో ఒక్క ఇల్లు కూడా కట్టలేకపోయారని, సెంటు స్థలం కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. తమ హయాంలో 30 వేల మందికి పట్టాలు ఇచ్చి ఇల్లు కట్టిస్తున్నామని, ఇది అభివృద్ధి కాదా? అని నిలదీశారు. జగన్నాథపురానికి ప్రత్యేక నీటి ప్రాజెక్టును సీఎం మంజూరు చేసినా విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. అతని హయాంలో కోట్లాదిరూపాయలు స్మార్ట్ సిటీ నిధులు దుర్వినియోగం చేస్తే, తాము అధికారంలోకి వచ్చాక మురికి వాడల కోసం రూ.100 కోట్లు వెచ్చించామని గుర్తు చేశారు.

అవినీతికి చిరునామా వనమాడి

తిరుపతి లేఖలు, బదిలీ సిఫార్సులకు కూడా లంచాలు తీసుకునే చరిత్ర కొండబాబుదని ఎమ్మెల్యే ఆరోపించారు. రూ.వెయ్యి నుంచి రూ.కోట్ల వరకు లంచాలు దిగమింగే ఘనమైన చరిత్ర వనమాడి కుటుంబానిదని మండిపడ్డారు. టీడీపీ శంకుస్థాపనలకే పరిమితమైతే తాము వానికి పూర్తిచేసి వినియోగంలోకి తెస్తున్నామన్నారు. కొండబాబు ఆక్రమించిన స్థలంలో కొంత భాగాన్ని వదులుకుంటే నాలుగు డివిజన్ల పరిధిలోని ప్రధాన ముంపు సమస్యకు పరిష్కారం లభిస్తుందని, అందుకోసం టీడీఆర్ బాండ్లు ఇస్తామన్నా ఆయన ఎందుకు ముందుకు రావడం లేదని నిలదీశారు. మూడో వంతెనను అడ్డుపెట్టుకుని భూసేకరణలో కోట్లు కొట్టేయడానికి కొండబాబు ఆడిన డ్రామా ఆధారాలతో సహా తన వద్ద ఉందన్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా అతని స్థలం మీదుగా వంతెన నిర్మాణం జరిగే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాగిరెడ్డి కళాక్షేత్రం తన హయాంలోనే చాలా వరకు పూర్తి చేసినట్టు కొండబాబు చెప్పడం అబద్ధమని, గత ఎన్నికలకు కొద్దిరోజుల ముందు అతను శంకుస్థాపన చేసి వదిలేస్తే తాను పూర్తి చేయించానన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

నీ స్థానం తెలుసుకుని మాట్లాడు..

టీడీపీ టిక్కెట్ కోసం కొండబాబు అన్న కోడలు రేసులో ముందుందని, కుటుంబంలో వనమాడి నాలుగో స్థానంలో టిక్కెట్ రేసులో ఉన్నారన్నారు. ముందుగా ఇల్లు చక్కదిద్దుకుని తన టిక్కెట్ ఖరారు చేసుకున్నాక వనమాడి తన గురించి మాట్లాడాలని హితవుపలికారు. కాకినాడ సిటీ నుంచే తాను పోటీ చేస్తానని, ముందు కొండబాబు తన టిక్కెట్‌ను ఖరారు చేసుకుని మాట్లాడాలన్నారు. తనపై పవన్‌కల్యాణ్ గానీ, ఆ పార్టీ అభ్యర్థిగానీ పోటీ చేయాలని గతంలో చేసిన సవాల్‌కు కట్టుబడి ఉన్నానని, అలా చేయలేకపోతే తనపై చేసిన విమర్శల నుంచి పవన్‌కల్యాణ్ తోక ముడిచినట్లేనన్నారు.

బాలికకు సీఎం సాయం అందజేత



కనకమహాలక్ష్మికి రూ.లక్ష చెక్కు, పింఛన్ ఉత్తర్వులు అందజేస్తున్న నాయకులు

కరప: గ్రామ శివారు రామకంచిరాజునగర్ కాలనీకి చెందిన 12 ఏళ్ల గనిశెట్టి కనకమహాలక్ష్మికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూ.లక్ష ఆర్థిక సాయం, పీహెచ్ పింఛన్ రూ.5 వేలు మంజూరుచేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆమె వయసుకు దగ్గ ఎదుగుదల లేకపోవడంతో ఆమె పడుతున్న ఇబ్బందులను సర్పంచ్ సాదే ఆశాజ్యోతి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ద్వారా సీఎం జగన్‌ను కలిసేందుకు కృషి చేశారు. కలెక్టర్ అనుమతితో కనకమహాలక్ష్మిని సర్పంచ్ ఆశాజ్యోతి సీఎంకు పరిచయం చేసి పరిస్థితిని వివరించారు. ఈ మేరకు ఆయన తదుపరి చర్యలు తీసుకుంటూ వెంటనే ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఆశాజ్యోతి, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఉప సర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ తదితరులు ఆమెకు రూ.లక్ష చెక్‌ను, పీహెచ్ పింఛన్ మంజూరు ఉత్తర్వులను అందజేశారు.

ఆరోగ్యశ్రీ రిఫరల్ కేసులను పర్యవేక్షించండి

అధికారులతో కలెక్టర్ కృతికా శుక్లా సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ

కాకినాడ సిటీ: జిల్లాలో జరుగుతున్న రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష సక్రమంగా నిర్వహించడంతో పాటు వైద్య శిబిరాల్లో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేసిన కేసులపై వైద్యాధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి గురువారం అమరావతి నుంచి కలెక్టర్‌తో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జేసీ ఇలక్కియతో కలిసి ఆమె పాల్గొన్న అనంతరం జిల్లా అధికారులతో సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ముద్రించిన కొత్త ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ నూరుశాతం పూర్తి చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులకు స్పష్టం చేశారు. ఇప్పటి వరకు జిల్లాలో 60 వేల కార్డుల పంపిణీ చేసినట్టు కలెక్టర్ తెలిపారు. రీ సర్వే పనుల్లో పురోగతి చూపాలని, ఉపాధి హామీ పథకం పని దినాలు, జల్ జీవన్ మిషన్ పనులు, ఇతర ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై ఆమె సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎంహెచ్ఓ జె నరసింహనాయక్, డీఐవో కె.రత్నకుమార్, ఐసీడీఎస్ పీడీ కె ప్రవీణ, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త పి రాధాకృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

నంది పురస్కార గ్రహీతకు సత్కారం



కుమార్‌బాబును సత్కరిస్తున్న సీతారామాంజనేయ నాటక మండలి వ్యవస్థాపకుడు దక్షిణామూర్తి

కాకినాడ రూరల్: గత నెలలో గుంటూరులో నిర్వహించిన నంది నాటకోత్సవాల్లో ఉత్తమ ప్రతినాయకుడిగా పురస్కారం అందుకున్న వైఎస్ కుమార్ బాబును సాటి కళాకారులు గురువారం సత్కరించారు. స్థానిక ఏపీఎస్పీ సీతారామాంజనేయ నాటకమండలి కళాకారుడైన కత్తిపూడికి చెందిన కుమార్‌బాబును ఏపీఎస్పీ ఎదురుగా సీతారామాంజనేయ మందిరం వద్ద నాటక మండలి వ్యవస్థాపకుడు ఎ.దక్షిణామూర్తి ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా కుమార్ బాబు మాట్లాడుతూ తాను స్వీయ దర్శకత్వం వహించి, నటించిన సీతా కల్యాణం నాటికలో ప్రదర్శనకు ఈ పురస్కారాన్ని గెలుచుకున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు శ్రీనివాస్, రామకృష్ణ, బాబూరావు, తురగా సూర్యారావు పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షతల పంపిణీ

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): అయోధ్య బాలరాముని పూజాక్షతలు ప్రతి ఇంటికీ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు బీజేపీ జిల్లా ఈస్ట్ మండలం అధ్యక్షులు గాలి దేవర శేఖర్ అన్నారు. స్థానిక 7వ డివిజన్లో రేచర్ల పేట పోస్టల్ కాలనీ చిన్న వీధి అరుంధతి రామాలయం నుంచి స్వామివారి అక్షతల పంపిణీని గురువారం ప్రారంభించారు. అరుంధతి వెంకటేశ్వర రామ దేవాలయం కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

కరపలో..

కరప: గ్రామంలో శ్రీరామభక్తులు అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షతలను గురువారం అందజేశారు. ప్రతి రామాలయంలో అయోధ్య రాముని అక్షతలు, రామాలయం ఫొటోలు, కరపత్రాలు ఉంచి పూజలు చేశారు. శ్రీరామజన్మభూమి తీర్థయాత్ర అయోధ్య ప్రతినిధులు, వీహెచ్‌పీ సభ్యుల సూచనల మేరకు ఇంటింటికీ వెళ్లి అందజేస్తున్నట్టు గొర్రెల శ్రీనివాస్, సలాది మనోజ్‌కుమార్, పేపకాయల వీర్రాజు, నక్కా శ్రీనివాస్ తదితరులు తెలిపారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడండి

- ప్రత్యేక అధికారులకు కమిషనర్ ఆదేశం
- కార్మికుల సమ్మె నేపథ్యంలో సమీక్ష



కాకినాడ: పారిశుద్ధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రత్యేకాధికారులను నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఆదేశించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ప్రత్యేకాధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై సమీక్షించారు. కార్మికుల సమ్మెను దృష్టిలో పెట్టుకుని ప్రజలు కూడా చెత్తను రోడ్లపైనా, డ్రైనేజీలలో వేయకుండా సహకరించాలని సూచించారు. చెత్త వాహనాలు ఇళ్ల వద్దకు వచ్చినపుడు చెత్తను వారికి ఇవ్వాలని సూచించారు. సమావేశంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, శానిటరీ సూపర్‌వైజర్లు జిలానీ, రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

98,795 ఓటరు దరఖాస్తుల పరిష్కారం
– ఈఆర్వో నాగనరసింహారావు

కాకినాడ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ–2024లో భాగంగా నియోజకవర్గ పరిధిలో లక్షా 11,767 దరఖాస్తులు వచ్చాయని ఈఆర్‌ఓ, కమిషనర్ నాగనరసింహారావు చెప్పారు. సవరణ ప్రక్రియ ప్రగతిపై స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షించారు. డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్ , ఏఈఆర్‌ఓలు, పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. ఇప్పటి వరకు దాదాపు 98,795 దరఖాస్తులను పరిష్కరించి ఆన్‌లైన్ చేశామన్నారు. ఇంకా 1174 దరఖాస్తులను పరిష్కరించాల్సి ఉందన్నారు. సుమారు 11,758 దరఖాస్తులు తిరస్కరించామన్నారు. దరఖాస్తుల పరిష్కారంలో కాకినాడ జిల్లా అగ్రస్థానంలో ఉందన్నారు. దరఖాస్తులు భారీగా వస్తున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 12వ తేదీ వరకు గడువు పెంచిందన్నారు. ఓటర్ల తుది జాబితాను జనవరి 22న ప్రచురిస్తారన్నారు. ఏఈఆర్వోలు హరిదాసు, మురళీకృష్ణ, జాన్ బాబు, వరహాలయ్య, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

తుక్కు దుకాణంలో అగ్ని ప్రమాదం



మంటలను అదుపులోకి తెస్తున్న ఫైర్ సిబ్బందికి సహకరిస్తున్న సత్యనారాయణ బృందం

కాకినాడ క్రైం: కాకినాడలో ఓ స్క్రాప్ దుకాణంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. రేచర్లపేటలోని యూపీహెచ్‌సీని ఆనుకుని ఉన్న ఈ దుకాణ యజమాని జాకీర్ హుస్సేన్ తన సాధారణ కార్యకలాపాలలో భాగంగా గురువారం మధ్యాహ్నం పాత విద్యుత్ తీగలకు మంట పెట్టి రాగిని సేకరిస్తున్నాడు. గాలికి ఆ మంటలు వ్యాపించి పక్కన ఉన్న వ్యర్థాలకు అంటుకోవడంతో అగ్ని కీలలు ఎగసిపడ్డాయి. స్థానికులు సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది మూడు ఫైర్ ఇంజిన్లతో చేరుకుని రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపుచేశారు. సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని సాలిపేట ఏడీఎఫ్‌వో సుబ్బారావు తెలిపారు. అగ్నిమాపక శకటాలు వచ్చేలోగా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ రోకళ్ల సత్యనారాయణ బృందం సైతం మంటలను అదుపు చేసేందుకు శ్రమించారు.

న్యాయస్థానం విధులకు ఆటంకం కలిగించినందుకు కేసు

కాకినాడ లీగల్: న్యాయస్థానం విధులకు ఆటంకం కలిగించిన భార్యాభర్తలను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే స్థానిక మూడో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో కుటుంబ ఆస్తులకు సంబంధించి పార్టిషన్ దావా విచారణలో ఉంది. సదరు ఆస్తిని పంపకాలు చేయవద్దని జి.మామిడాడకు చెందిన భీమన్న చత్రపతి శివాజీతో పాటు, ఆయన భార్య ఝాన్సీ కోర్టు విధులకు గురువారం ఆటంకం కలిగించారు. అలాగే ఆ ఆవరణలో వారు కేకలు వేసి, విధులకు ఆటంకం కలిగించి, కోర్టుపై అనేక ఆరోపణలు చేశారు.దీంతో కాకినాడ మూడో అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.రమేష్‌నాయుడు ఆదేశాల మేరకు కోర్టు సూపరింటెండెంట్ ఎంపీ లక్ష్మణరావు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో భీమన్న చత్రపతి శివాజీలో పాటు భార్య ఝాన్సీపై వన్‌టౌన్ పోలీసులు ఐపీసీ 199, 228, 353 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

బకాయి వేతనాలను చెల్లించండి

కాకినాడ సిటీ: యూటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కాకినాడ ధర్నా చౌక్ వద్ద యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు గురువారం ధర్నా చేశారు.

విద్యాశాఖ అధికారులు నిరంకుశ వైఖరి విడనాడాలని, ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలకు రావలసిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ నాయకులు కేవీవీ నగేష్, టి.రవిచక్రవర్తి, జి.ప్రభాకరవర్మ తదితరులు పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలీ జన్మదిన వేడుకలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీ సీఈవో రమణారెడ్డి తదితరులు

కాకినాడ సిటీ: స్థానిక సాంబమూర్తినగర్ ప్రభుత్వ బధిర బాలికల వసతి గృహ ప్రాంగణంలో గురువారం లూయిస్ బ్రెయిలీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. జెడ్పీ సీఈఓ ఎ.రమణారెడ్డి, వసతి గృహం సహాయ సంచాలకుడు పి.నారాయణమూర్తి ఆయనకు నివాళులు అర్పించారు. అనంతరం అంధులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. 10 మంది అంధులకు చేతి కర్రలు, ఇద్దరు బధిర విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన 2024వ సంవత్సరం బ్రెయిలీ క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించి పంపిణీ చేశారు. ప్రభుత్వ అంధుల ఆశ్రమం, కాకినాడలోని నివాసితులైన అంధులు, అంధ ఉద్యోగులు, అంధ ఉద్యోగులు అసోసియేషన్ అధ్యక్షుడు వై.సతీష్, ఉపాధ్యక్షుడు మణికంఠ, శాంతివర్ధన మినిస్ట్రీస్, దివిలి ప్రత్యేక పాఠశాల నిర్వాహకులు ఆర్.వీరబాబు పాల్గొన్నారు.

బాలత్రిపుర సుందరిని దర్శించుకున్న కేంద్ర మంత్రి



బాలాత్రిపుర సుందరి ఆలయంలో పూజల్లో పాల్గొన్న కేంద్ర మత్స్య, పశు సంరక్షణ సహాయ మంత్రి ఎల్ మురుగన్

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలోని బాలత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి వారికి గురువారం కేంద్ర మత్స్య, పశుసంరక్షణ సహాయ మంత్రి ఎల్.మురుగన్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆలయ చరిత్రను వివరించారు. అనంతరం వేద ఆశీర్వాదం అందించారు. ఈఓ చింతపల్లి విజయ భాస్కర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పెద్ది రత్నాజీ మంత్రికి అమ్మవారి ప్రసాదం, చిత్రపటాన్ని అందించారు. యానం ఎమ్మెల్యే గొల్లపల్లి అశోక్, కౌడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, బీజేపీ జిల్లా అధ్యక్షులు చిలుకూరి రామ్‌కుమార్, బీజేపీ నాయకుడు గట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

పేదలకు కళ్లజోళ్లు, వస్త్రాల పంపిణీ



కళ్లజోళ్లు, వస్త్రాలు పంపిణీ చేస్తున్న ప్రాజెక్టు సభ్యులు

బాలాజీచెరువు: లయన్స్‌క్లబ్ హాల్లో బాదం బాలకృష్ణ క్లాత్ అండ్ ఐగ్లాస్ ప్రాజెక్టు ద్వారా పేదలకు గురువారం కళ్లజోళ్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా కొమ్మిశెట్టి మెడికల్స్ అధినేత కొమ్మిశెట్టి కుమార్ హాజరై అందజేశారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ జగన్నాథరావు, బాదం బాలకృష్ణ, సుబ్రమణ్యం, పులవర్తి కుమార్ పాల్గొన్నారు.

పీఆర్ ఒకేషనల్ ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్

బాలజీచెరువు: పీఆర్ ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ సాధనాల శాంతి రాజశ్రీకు ఆంధ్రా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. 'ఫ్రమ్ బీయింగ్ దళిత్ టు బికమింగ్ డైనమిక్ సెలక్టెడ్ వర్క్స్ ఆఫ్ దళిత్ ఉమెన్ రైటర్స్ ఏ స్టడీ' అంశంపై ప్రొఫెసర్ సోమలత ఆధ్వర్యంలో సిద్ధాంత వ్యాసం రచించారు. ఈ సందర్భంగా శాంతిశ్రీను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది గురువారం అభినందించారు.

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ

కరప: మండలంలో పలువురిని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పరామర్శించారు. కూరాడలో వైఎస్సార్ సీపీ నాయకుడు సర్పంచ్ వాసంశెట్టి వెంకటరమణ (కొండ) గుండెపోటుతో ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. తర్వాత పెద్దాపురప్పాడులో పర్యటించి, గ్రామానికి చెందిన పాస్టర్, మండల పాస్టర్స్ యునైటెడ్ ఫెలోషిప్ వైస్ ప్రెసిడెంట్ బిషప్ టి.దొరబాబు మృతిచెందగా కుటుంబసభ్యులను కలిసి సంతాపం వ్యక్తంచేశారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, కూరాడ పీఏసీఎస్ చైర్మన్ రావులు ప్రసాద్, జి.భావారం సర్పంచ్ రొక్కాల గణేష్, పెద్దాపురప్పాడు ఉప సర్పంచ్ బిరుదా శ్రీనివాస అప్పారావు తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె

కాకినాడ: రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు గురువారం నుంచి పారిశుద్ధ్య కార్మికులు సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేషన్ కార్యాలయం వద్ద యూనియన్ గౌరవాధ్యక్షుడు కిర్ల కృష్ణారావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేసి కార్పొరేషన్ వద్ద బైఠాయించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడ కొండ తదితరులు పాల్గొన్నారు.

24వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

కరప: వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 24వ రోజుకు చేరుకుంది. మండల పరిధిలోని అంగన్‌వాడీలు, ఆయాలు కరపలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద కాకినాడ రూరల్ ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎం.వీరవేణి, కరప ప్రాజెక్టు నాయకురాలు నిరసన దీక్షలు చేపట్టారు.